క్లుప్తంగా

గ్రామసభలతో భూ సమస్యల పరిష్కారం



రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రస్తుతం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఆర్ ఎస్ డీటీ రమేష్ తెలిపారు. చామనేరు గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి 58 వినతులు స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు. డీటీ మాట్లాడుతూ మండలంలో 7 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే నిర్వహించామన్నారు. రీ సర్వేపై అభ్యంతరాలు ఉన్న వారు అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. గ్రామసభలో రైతులు అందజేసిన వినతులను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. మండల సర్వేయర్ సాయిరాజ్ పాల్గొన్నారు.

సంకరజాతి పేయ దూడలతో లాభాలు



మహిళా రైతుకు బహుమతిని ప్రదానం చేస్తున్న పశువైద్యులు

రొంపిచెర్ల: సంకరజాతి పేయ దూడలతో అధిక పాల ఉత్పత్తి జరిగి లాభాలు ఆర్జించ వచ్చని ఏపీ ఎల్‌డీఏ ఈఓ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం మద్దిపట్లవారిపల్లెలో పశుసంతతి పరిశీలన పథకంలో సంకర జాతి పేయ దూడల ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంకర జాతి పేయ దూడలు మన ప్రాంతంలో అన్ని రకాల వ్యాధులను తట్టుకుంటాయన్నారు. అనంతరం ఉత్తమ పేయ దూడలను ఎంపిక చేసి వాటి యజమానులకు బహుమతులను ప్రదానం చేశారు. ఏడీ శ్రీనివాసులనాయుడు, రొంపిచెర్ల, పెలిచెర్ల, సదుం, సోమల పశు వైద్యాధికారులు తబ్రీజ్‌బాషా, శ్రీహరి, మునిచంద్ర, ప్రదీప్, చందనప్రియ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో తెలుగుభాష వారోత్సవాలు

పుంగనూరు: ప్రతిఒక్కరూ తెలుగుభాషలో మాట్లాడడం, రాయడం అలవరుచుకోవాలని హెచ్‌ఎం రుద్రాణి కోరారు. మంగళవారం జెడ్పీ హైస్కూల్‌లో తెలుగుభాష వారోత్సవాలు నిర్వహించారు. రిటైర్డ్ అధ్యాపకులు రెడ్డెప్పరెడ్డి, వెంకటపతి, గంగులమ్మ, ద్వారకమ్మ ద్వారా విద్యార్థులకు తెలుగుభాషా ఔన్నత్యాన్ని వివరింపజేశారు. ఉపాధ్యాయులు జీవీ రమణ, సుజాత, ముత్యాలు పాల్గొన్నారు.

ఎంపీకి బెయిల్‌పై హర్షం

సదుం: పుంగనూరు కేసులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి కోర్టు బెయిల్ మంజూరు చేయడం పట్ల ఆయన అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. బస్టాండ్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నేతలు ఎన్ని అక్రమ కేసులు బనాయించినా పార్టీలో ఎవరూ బెదిరేది లేదని, బలహీన పరచలేరని చెప్పారు. ఉప సర్పంచ్ బాబురెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుట్రాజు, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, ఎల్లారెడ్డి, రామాంజులు, శ్రీనివాసులు, అన్నారెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 18 మందికి ఉద్యోగాలు



నియామకపత్రాలు అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి, గుణశేఖర్

పుంగనూరు: గూడూరుపల్లి వద్ద గల మైనారిటీల ఐటీఐ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 18 మందికి ఉద్యోగాలు లభించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలకు 38 మంది హాజరయ్యారు. వీరిలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగులు సుబ్రమణ్యం, సిసింద్రి, అబ్దుల్ పాల్గొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం!



మాట్లాడుతున్న కడా పీడీ

కుప్పం: ఆరు నెలల్లో కుప్పం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కడా పీడీ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. మంగళవారం కడా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధికి రూ.110 కోట్లు, హాస్టల్ అభివృద్ధికి రూ.15 కోట్ల మేర ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కడా, మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. 2025 నాటికి కేంద్రియ విద్యాలయం, శాంతిపురంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హుండీ ఆదాయం రూ.9.36 లక్షలు

కుప్పం: పట్టణంలోని ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయ హుండీ ఆదాయం రూ.9.36 లక్షలు లభించినట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. మంగళవారం దేవాలయం ప్రాంగణంలో హుండీ లెక్కించారు. లెక్కింపులో రూ.9.36 లక్షల నగదు, 40 గ్రాముల బంగారాన్ని భక్తులు కానుకలుగా సమర్పించారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలకు.. కుయ్ కుయ్



- 4నెలలుగా 108 సిబ్బందికి వేతనాలు నిల్
- ఏజెన్సీ, ప్రభుత్వం చెడుగుడు

బైరెడ్డిపల్లి: రాజన్న ప్రభుత్వంలో ఫోన్ కొడితే.. కుయ్..కుయ్‌మంటూ రోడ్లపై పరుగులు పెడుతూ ప్రాణాలు కాపాడే సంజీవనిగా 108 వాహనాలు నిలిచాయి.. వైఎస్ జగన్ ప్రభుత్వంలోనూ 108 వాహనాలను ఆధునీకరించి మరింత మెరుగైన సేవలను ప్రజలకు అందించారు. కానీ ప్రజలకు అలవి కాని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 108 వాహనాల నిర్వహణ విషయంలో చతికిలపడి ప్రజల్లో అభాసుపాలవుతోంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో వైద్యానికి పెద్దపీట వేశారు. డొక్కు వాహనాల స్థానంలో ఆధునీకరించిన 108 వాహనాలను ప్రతి మండలానికి ఏర్పాటు చేసి సిబ్బందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఇందుకు భిన్నంగా పరిపాలన సాగిస్తోంది. అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడే 108 వాహనాల సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. నాలుగు నెలలు పూర్తి అవుతున్నా జీతాలు రాకపోవడంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. సకాలంలో జీతాలు చెల్లించాల్సిన ఏజెన్సీ అయిన అరబిందో సంస్థ, ప్రభుత్వం ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ చిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.

పైసా విదల్చని ప్రభుత్వం:

నియోజకవర్గంలో ఐదు 108 వాహనాలు సేవలు అందిస్తున్నాయి. ప్రతి వాహనానికి నలుగురు చొప్పున సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే గత జూలై నుంచి ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా 108 సిబ్బందికి జీతాలు చెల్లించలేదు. వీరంతా కుటుంబ నిర్వహణకు భారీగా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

సిబ్బందిపై పనిభారం అధికం

ప్రస్తుతం 108 సిబ్బందిపై పనిభారం అధికంగా ఉంటోంది. రోడ్డు ప్రమాదాలు పెరగడం, అత్యవసర కేసులు, ఏరియా హాస్పిటల్ నుంచి రెఫరల్ కేసులు అధికంగా ఉండడంతో సిబ్బందిపై పనిభారం అధికమవుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా 108 వాహనాలు తిరుగుతూనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో జీతాలు సక్రమంగా ఇవ్వకపోతే ఎలా పనిచేయాలంటూ సిబ్బంది వాపోతున్నారు.

బిల్లులు అందకపోవడం

ప్రభుత్వం 108 వాహనాల నిర్వహణ బాధ్యతను అరబిందో సంస్థకు అప్పజెప్పింది. వాహనాల నిర్వహణతో పాటు, సిబ్బంది జీతాలు ఆ సంస్థే చెల్లించాల్సి ఉంటుంది. దీనికిగాను ఆ సంస్థకు ప్రభుత్వం పాత వాహనమైతే నెలకు రూ.2.20 లక్షలు, కొత్త వాహనమైతే రూ.1.90 లక్షలు చెల్లిస్తోంది. వీటితోనే వాహనాల నిర్వహణ, సిబ్బంది జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కూటమి ప్రభుత్వం అరబిందోకు చెల్లించాల్సిన బిల్లులను ఇంతవరకు చెల్లించలేదు. దీంతో వాహనాల నిర్వహణ కష్టతరంగా మారింది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో సిబ్బంది జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి బిల్లులు సక్రమంగా రాకపోతే వాహనాల నిర్వహణ కుంటుపడుతోంది దీని వల్ల అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు సకాలంలో గమ్యస్థానాన్ని చేరుకోలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే గత ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు ఇవ్వడంతో పాటు, పాత వాహనాల స్థానంలో కొత్త వాహనాలను సకాలంలో అందించేదని సిబ్బంది గుర్తు చేసుకుంటున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 108 వాహనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి..



నాలుగు నెలలు అవుతున్నా జీతాలు చెల్లించలేదు. చిరుద్యోగులకు జీతాలు రాకపోతే ఎలా ఉంటుందో తెలియందేమీ కాదు. అత్యవసరమని ఫోన్ రాగానే ప్రాణాలు లెక్కచేయకుండా సంఘటన స్థలం చేరుకొని అత్యవసర సేవలు అందిస్తున్నాం. అలాంటి మాకు జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంతో అప్పులుపాలు కావాల్సి వస్తోంది.

– హేమగిరి, 108 పైలట్

పండుగ పూట పస్తులేనా..



అప్పులు చేసి పండుగ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జీతాలు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టినా ఫలితం లేదు. నాలుగు నెలలు గడుస్తున్నా జీతాలు రాలేదు. అప్పు కావాలని అడిగినా ఎవరూ ఇవ్వడం లేదు. నిత్యం ప్రజలకు సేవ చేసే మాకు జీతాలు వెంటనే మంజూరు చేయాలి.

– శివభూషణ్, ఈఎంటీ

సర్పంచులకు సమాచారం ఇవ్వరా?

- తీర్మానాలు లేకుండానే పనులు మంజూరా?
- ప్రజలను ఇబ్బంది పెట్టడం తగదు
- మండల మీట్‌లో సభ్యుల ధ్వజం



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్

రొంపిచెర్ల: గ్రామ పంచాయతీలలో జరిగే సమావేశాలపై సర్పంచులకు సమాచారం ఇవ్వకుండానే నిర్వహిస్తున్నారని జాండ్లవారిపల్లె సర్పంచ్ నాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల నుంచి గ్రామ పంచాయతీలలో ఎలాంటి సమావేశాలు జరిగినా సర్పంచ్‌లకు అధికారులు సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్‌లకు సమాచారం ఇస్తామని హామీ ఇచ్చారు. జగనన్న లేఔట్లలోని లబ్ధిదారులు ఇళ్ల పనులను నెల రోజుల్లోపు పూర్తి చేయకుంటే ఇళ్లు రద్దవుతాయని హౌసింగ్ ఏఈ యోగానంద్ తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదలకు మంజూరు చేసిన పింఛన్లు తొలగించవద్దని అన్నారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో సమావేశాలు నిర్వహించకుండా ఎక్కడపడితే అక్కడ నిర్వహించడం అధికారులకు తగదన్నారు. మండలంలో నవంబర్ 21న నాలుగు చెరువులకు సాగు నీటి ఎన్నికలు జరుగుతున్నట్లు ఇరిగేషన్ ఏఈ మునిచంద్ర తెలిపారు. వైస్ ఎంపీపీలు విజయశేఖర్‌బాబు, నూలు రెడ్డెప్ప, ఎంపీటీసీలు రమణమ్మ, సీరాజున్నీసా, కోఆప్షన్ మెంబర్ ఖాదర్ బాషా , సర్పంచ్‌లు సుధారాణి, జీవలత, హేమలత, అన్సర్‌బాషా, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

బందోబస్తుతో సమావేశం

పోలీసు బందోబస్తుతో రొంపిచెర్ల మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. రెండు నెలలుగా సమావేశం నిర్వహించేందుకు టీడీపీ నేతలు ఎంపీటీసీలను, సర్పంచ్‌లను బెదిరించారు. దీంతో రెండుసార్లు నిలిచిపోయాయి. మూడో సారి సమావేశాలు జరగకుంటే ఎంపీటీసీల సభ్యత్వం రద్దు అవుతుందని ఎంపీపీ, జెడ్పీటీసీ కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కుప్పం విద్యార్థులు



విద్యార్థిని శకుంతలతో వ్యాయామ ఉపాధ్యాయుడు



నిత్యశ్రీతో ఉపాధ్యాయులు

కుప్పం రూరల్ : కుప్పం మండలం, చందం, టి.సదుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. చందం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శకుంతల మంగళవారం తిరుపతి జిల్లా మంగళం ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్ –17 బేస్‌బాల్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. దీంతో రాష్ట్ర స్థాయిలో నవంబర్ 9, 10 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం మార్కొండ నాయుడు తెలిపారు. సోమవారం సత్యవేడులో జరిగిన పోటీల్లో మండల పరిధిలో టి.సదుమూరు ఉన్నత పాఠశాలకు చెందిన నిత్యశ్రీ అండర్–17 రగ్బీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం పద్మనాభరాజు తెలిపారు. చందం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథం, టి.సదుమూరు ఉపాధ్యాయుడు ప్రకాశ్‌ను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

ఉలవసాగు లాభదాయకం

కల్లూరు(పులిచెర్ల): ఉలవ సాగు లాభదాయకమని మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తుడుంవారిపల్లె, చిన్న బెస్త పల్లెల్లో పర్యటించారు. తక్కువ నీటితో తక్కువ సమయంలో ఉలవ పంట చేతికొస్తుందన్నారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించారు.



ఉలవ సాగును పరిశీలిస్తున్న అధికారులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి



నివాళులర్పిస్తున్న నేతలు

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కేవీ రమణ(41) ఆదివారం రాత్రి తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మంగళవారం మృతదేహం శంకర్రాయలపేటకు వచ్చిన విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి పార్టీ శ్రేణులతో కలసి గ్రామానికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సర్పంచ్ హరినాథ్, వైస్ ఎంపీపీ జీడీ బాబు, వైస్ సర్పంచ్ కృష్ణమూర్తి, నేతలు జగదీష్, అమరనాథ్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

వి.కోట: దీపావళి పండుగ నేపథ్యంలో లైసెన్స్ కలిగిన బాణసంచా దుకాణదారులు ప్రభుత్వ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సీఐ సోమశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో బాణసంచా దుకాణంలో నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అక్రమ నిల్వలు ఉంటే కేసులు తప్పవని హెచ్చరించారు.

'పుర' అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్ అలీంబాషా, చిత్రంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా తెలిపారు. మంగళవారం కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు కిజర్ ఖాన్, రెడ్డెమ్మ మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైందని, అక్రమ లేఔట్లు, ఇంటింటికీ కొళాయిల ద్వారా మంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. చైర్మన్ మాట్లాడుతూ మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, డీఈఈ మహేష్, మేనేజర్ విజయభారతి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జగదీశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు: ప్రభుత్వాదేశాల మేరకు ఉచిత గ్యాస్ కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేయాలని తహసీల్దార్ రాము కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 8,134 మంది బీపీఎల్ రేషన్ కార్డుదారులు ఉన్నారని, వీరందరూ అర్హులని తెలిపారు. నమోదు కార్యక్రమం ప్రారంభించామని వచ్చే ఏడాది మార్చి 31 వరకు నమోదు చేసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

సామగుట్టపల్లిలో పొలం పిలుస్తోంది

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలోని సామగుట్టపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు సంబంధిత అధికారులు సంయుక్తంగా రైతులకు అవగాహన కల్పించారు. ఆయా శాఖ అధికారులు తమ పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు.

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

గుడుపల్లె: రైతులు అనుభవిస్తున్న భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సీతారాం పేర్కొన్నారు. మంగళవారం సోడిగానిపల్లెలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. రైతులు తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు పొలం వద్దకు వెళ్లి ఇరువర్గాల రైతులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. పాసు పుస్తకాలు 6, సర్వే 8, ఎల్‌పీఎం నంబర్ల మార్పు 10కు సంబంధించిన సమస్యలనుపరిష్కరించారు. డీటీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు



ప్రత్యేక పూజల్లో విద్యార్థినులు

కుప్పంరూరల్: కుప్పం డిగ్రీ కళాశాలలో 'ప్రీ దివాళి ఫెస్ట్' పేరిట ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. మంగళవారం ఉదయం కళాశాల ఆవరణ మొత్తం మట్టి దీపాలను వెలిగించి, రంగవల్లులు వేసి పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. తరువాత విద్యార్థులు గౌరి ప్రతిమను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీసీఎస్ విద్యాసంస్థల సీఈఓ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు మున్సిపాలిటీకి అవార్డు



మంత్రి నారాయణ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు: పీఎం స్వనిధిసే సమృద్ధిలో భాగంగా 2023–24లో ఉత్తమ ప్రగతి సాధించినందున పలమనేరు మున్సిపాలిటీకి బెస్ట్ మున్సిపాలిటీ అవార్డు దక్కింది. ఆమేరకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ చేతులమీదుగా ఈ అవార్డును స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మంగళవారం అందుకున్నారు. మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ అర్బన్ ఏరియాస్ వారి ఆదేశాలతో ఇక్కడి మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి, ప్రగతి పారామీటర్ల ఆధారంగా ఈ అవార్డు దక్కింది. దీంతో స్థానిక మున్సిపల్ పాలకవర్గం మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరికి కృతజ్ఞతలను తెలిపింది. పాలక మండలి సహకారంతోనే రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవం

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండల యూటీఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఈశ్వర మహేంద్ర తెలిపారు. మంగళవారం రొంపిచెర్లలో యూటీఎఫ్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా రమణయ్య, గౌరవాధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, లత, ప్రధాన కార్యదర్శిగా యాసిన్, కోశాధికారిగా చెంగారెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా, మండల కౌన్సిలర్లు మరి కొంతమందిని ఎంపిక చేశారు. కార్యవర్గం మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామని తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లీలామాధవి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

ఆమె సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ఎంఈఓ, చిత్రంలో తిలగవతి

పలమనేరు: పట్టణంలోని ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన తిలగవతి సేవలు మరవలేనివని ఎంఈఓ లీలారాణి కొనయాడారు. తిలగవతి ఉద్యోగ విరమణ కార్యక్రమం స్థానిక పాఠశాలలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.